జర్నలిస్ట్

# వార్త

RNI NO :Title-Code :-TELTEL02102

తెలుగు దినపత్రిక

అనుక్షణం ప్రజలపక్షం...

WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పనిచేయుటకు

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని

అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.

ఎడిటర్ : బిర్రు కరుణాకర్

Cell: 9701249103

ప్రచురణ : హైదరాబాద్, శుక్రవారం 12-1-2024 సంపుటి :01 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ సంచిక : 115 పేజీలు : 4 వెల : 5-00

## విద్యకు సహకారం అందించండి



హైదరాబాద్:**జనవరి11జర్నలిస్ట్ వార్త**

రెసిడెన్షియల్ పాఠశాలలను బలోపేతం చేయడానికి ఏడాదిపాటు విద్యా కార్యక్రమాలు నిర్వహించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి సహకారం అందించాలని హార్వర్డ్ విశ్వవిద్యాలయ అధ్యాపకుల బృందానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.డాక్టర్ డొమినిక్ మావో నేతృత్వంలో హార్వర్డ్ వర్సిటీ అధ్యాపకబృందం గురువారం సీఎం రేవంత్‌ను ఆయన నివాసంలో కలిసిందిఉస్మానియా విశ్వవిద్యాలయంలో జనవరి 7 నుంచి నిర్వహిస్తున్న ప్రోగ్రాం ఫర్ సైంటిఫిక్లీ ఇన్‌స్పైర్డ్ లీడర్‌ప్ (పీఎస్‌ఐఎల్-24) కార్యక్రమంలో పాల్గొనడానికి ఈ బృందం రాష్ట్రానికి వచ్చింది. ఈ బృందం 40 ప్రభుత్వ పాఠశాలల్లో 10-12 తరగతులు చదువుతున్న 100 మంది విద్యార్థులతోపాటు 33 జిల్లాల ఉన్నత పాఠశాలల ఆంగ్ల ఉపాధ్యాయులకు 5 రోజులపాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుందని రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్, విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఎంఎస్ షెఫాలీ ప్రకాశ్, డాక్టర్ ఎండీ రైట్ పాల్గొన్నారు.

### సిఎం రేవంత్‌తో

# గూగుల్ వైస్ భేటీ





**హైదరాబాద్,జనవరి11 జర్నలిస్ట్ వార్త**

గూగుల్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ తోట గురువారం సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులపై రేవంత్‌తో చంద్రశేఖర్ చర్చించి ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి సంసిద్ధతను వ్యక్తం చేశారు.. తెలంగాణ పౌరుల అవసరాలను తీర్చడానికి నాణ్యమైన సేవలను అందించడానికి విస్తృత సాంకేతికత, నైపుణ్యం తమ వద్ద ఉందని చంద్రశేఖర్ వివరించినట్టుగా తెలుస్తోంది. గూగుల్ మ్యాప్స్, గూగుల్ ఎర్త్ ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించి సాధ్యమయ్యే రహదారి భద్రతపై కూడా ఇరువురి మధ్య చర్చ జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### 14నుంచి రాహుల్

# న్యాయ్‌యాత్ర

**మణిపూర్‌లో మొదలు..ముంబైలో ముగింపు**

**న్యూఢిల్లీ,జనవరి11 జర్నలిస్ట్ వార్త**

ఽదాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర జనవరి 14న మణిపూర్ నుంచి ప్రారంభం కానుందని ఏఐసీసీ జాతీయ అధికార ప్రతినిధి శమా అహ్మద్ పేర్కొన్నారు. మీడియా సమావేశంలో ఈ మేరకు తెలిపారు. మణిపూర్‌లో ప్రారంభమయ్యే ఈ యాత్ర దేశంలోని 15 రాష్ట్రాల గుండా కొనసాగి ముంబయిలో ముగుస్తుందన్నారు. ఈ క్రమంలో యాత్రలో భాగంగా 110 జిల్లాలు, 100 లోక్‌సభ స్థానాలు, 337 అసెంబ్లీ స్థానాలను కవర్ చేయనున్నట్లు చెప్పారు. ఈ యాత్ర కోసం కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధం కావాలని సూచించారు. అంతేకాదు ఈ యాత్రలో భాగంగా దేశంలోని సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలను ప్రస్తావించనున్నట్లు చెప్పారు. దీంతోపాటు దేశంలో యువత ఉద్యోగాలు ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తు చేశారు. బీజేపీ(ఃఏఖ) ప్రభుత్వం ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేసిందని శమా అహ్మద్ ఆరోపించారు.



3 లో

### జమ్మూ మాజీ సీఎంకి త్రుటిలో తప్పిన ప్రమాదం




### తెలంగాణలో ఎంపి ఎలక్షన్స్‌పై

# కాంగ్రెస్ ఫోకస్

- మంత్రులతో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే భేటీ
- 14 ఎంపి సీట్లలో గెలుపే లక్ష్యంగా దిశా నిర్దేశం
- సమన్వయంతో ముందుకు సాగాలని ఆదేశం

న్యూఢిల్లీ,జనవరి11 **జర్నలిస్ట్ వార్త**




తెలంగాణలో విజయంతో ఊపుమీదున్న కాంగ్రెస్.. లోక్‌సభ ఎన్నికలపై కూడా దృష్టి సారించింది. రానున్న ఎన్నికల్లో వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో విజయమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణ లోక్‌సభ సమన్వయ కర్తలతో ఢిల్లీలో అధిష్ఠానంకీలక భేటీ నిర్వహించింది. రానున్న ఎన్నికల్లో అమలు చేయాల్సిన వ్యూహాలు, ప్రణాళికలపై సమావేశంలో చర్చించారు నేతలు. కాంగ్రెస్ పార్టీ ఇటీవలే తెలంగాణలోని 17 స్థానాలకు..14 మంది కోఆర్డినేటర్లను నియమించింది.

సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటికి శ్రీనివాసరెడ్డికి రెండేసి లోక్‌సభ నియోజకవర్గాల బాధ్యతలు అప్పగించారు. ఇందులో భాగంగా నేటి సమావేశంలో.. మిత్రపక్షాలతో

సమన్వయం చేసుకోవడంపై నేతలకు దిశానిర్దేశం చేసినట్టు తెలుస్తోంది. మొత్తం మీద టార్గెట్ 14 గా పెట్టినట్లు తెలుస్తోంది.. ఇదే వ్యూహంతో ముందుకు సాగాలని అధిష్టానం సూచించినట్లు సమాచారం.. మరోవైపు రానున్న పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ నుండి 13 నుంచి 14 సీట్లు గెలవబోతున్నామని సమావేశం అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.. .



### సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయడమే నా లక్ష్యం: మంత్రి తుమ్మల



3 లో

### గత నెలలో ప్రపంచవ్యాప్తంగా 10 వేల

## కొవిడ్ మరణాలు

# ఎపి విభజన

## కారకుడు చంద్రబాబు

**మండిపడ్డ ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్**

- 2008లోనే తెలంగాణకు అనుకూలంగా లేఖ
- హోదా వద్దు ప్యాకేజీ ముద్దు అన్న వ్యక్తి
- ఆర్థిక పరిస్థితి అప్పటికన్నా ఇప్పుడే మెరుగు
- అయినా ప్రభుత్వంపై బాబు బురదజల్లే యత్నం

**అమరావతి,జనవరి11 జర్నలిస్ట్ వార్త**




రాష్ట్రంలో వైసీపీ మినహా అన్ని పార్టీలతో పొత్తు పెట్టుకున్న వ్యక్తి చంద్రబాబు అని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ విమర్శించారు. రాష్ట్ర విభజనకు ప్రధాన కారకుడు చంద్రబాబేనని ఫైర్ అయ్యారు. 2008లో తెలంగాణ ఏర్పాటుకు లేఖ రాశాడు చంద్రబాబు.. ఏపీకి స్పెషల్ క్యాటగిరీ స్టేటస్ పోవటానికి చంద్రబాబు కారణం కాదా అని అన్నారు. హోదా వద్దు ప్యాకేజీ చాలు అని ఎందుకు అన్నారని నిలదీసిన ఆయన.. ప్రత్యేక ప్యాకేజీ కూడా సాధించుకోలేక పోయారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పు జనాభా ప్రకారం, ఆస్తులు లొకేషన్ బట్టి విభజన చేస్తే చంద్రబాబు ఎందుకు మాట్లాడ లేదని ప్రశ్నించారు. పోలవరం ఆలస్యానికి గత ప్రభుత్వమే కారణం. పోలవరం ప్రాజెక్ట్‌ను పూర్తి చేయడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. కేంద్రం నుండి మన వాటా నిధులు మేము సాధిస్తున్నాం. రాష్ట్రానికి ఇబ్బంది కలిగించే నిర్ణయాలు చంద్రబాబు తీసుకున్నారన్నారు. అందుకే ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని బుగ్గన మండిపడ్డారు. ఇకపోతే ఏపీ ఆర్థిక పరిస్థితిపై ప్రతిపక్షాలు అసత్యాలు ప్రచారం చేస్తున్నాయని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఆధారంగా ఏపీ ఆర్థిక పరిస్థితిపై ప్రతిపక్షాలు మాట్లాడుతున్నాయని ప్రశ్నించారు.

### ఈ ఆరు దేశాల పాస్‌పోర్టులు అత్యంత శక్తిమంతమైనవి..




3లో

# ఎన్నికల ఏడాదిలో కోడిపందాలకు భరోసా

ఏలూరు,జనవరి11 ఎన్నికల సంవత్సరం కావడంతో కోడిపందాలకు జోరు పెరగనుంది. అలాగే చూసీచూడనట్లుగా ఉండాలని నేతలు కూడా చెబుతున్నారు. పందాలకు ఢోకా లేదన్న భరోసా ఇస్తున్నారు.ఇది ఎన్నికల ఏడాది. ఏమాత్రం పందేలు వద్దన్నా ఆ పార్టీపై ప్రభావం తప్పకుండా పడుతుంది. దీంతో చూసీచూడనట్లుగా పందేలాను కానిచ్చేలా నేతలు కూడా ప్రోత్సహిస్తున్నారు. ఈ ధైర్యంతో జిల్లాలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో బరుల ఏర్పాట్లలో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. పోలీసుల హెచ్చరికలను బేఖాతరు చేస్తున్నారు. జిల్లాలో పందాల నిర్వహణకు ఎకరాకు ఇంతని రైతులకు ముట్టచెబుతున్నారు. సంక్రాంతి పండుగ వస్తున్న నేపథ్యంలో బరులు ఏర్పాటులో నిర్వాహకులు మునిగిపోయారు. ఎన్నికల సంవత్సరం కావడంతో మనజోలికి ఎవరూ రారన్న ప్రచారం సాగుతోంది. లీడర్లే పరోక్షంగా భరోసా ఇస్తున్నారని సమాచారం. ఇందుకు సంబంధిత రైతులను ఒప్పించి వారికి ఎకరాకు రూ.10 వేలు నుంచి రూ.15 వేలు ఇస్తున్నారు. ఈ ఏడాది మరింత ఎక్కువైంది. పుష్కలంగా నీరుండే డెల్టాలో పందేలకు నిలయంగా మారిన ప్రాంతాల్లో కొన్ని భూముల్లో వరిసాగు చేయకుండా వదిలేస్తున్నారు. జిల్లాలో గతేడాది 500కు పైగా బరులు సిద్ధం చేశారు. ఒకప్పుడు ఉండి మండలం మహాదేవపట్నం, ఆకివీడులలో మాత్రమే బరులు ఉండేవి. నేడు బరులు లేని ప్రాంతాలు లేవంటే అతిశయోక్తి కాదు. గతేడాది సంక్రాంతికి ఖాళీ కనిపిస్తే చాలు బరి తయారు చేశారు.


దాని చుట్టూ జూదాలే. కోడి పందేల మాటున రూ.కోట్లు చేతులు మారితే జూద క్రీడల్లో అందుకు మూడు రెట్లు చేతులు మారాయి. కోడి పందేలు కంటే కోతాట, గుండాట వంటి జూదాలను నిర్వహించుకునేందుకు వాటి నిర్వాహకులతో బరులు సిద్ధం చేస్తున్న వారు ఇప్పట్నుంచే బేరసారాలు మొదలు పెట్టారు. ఇప్పటికే గ్రామాలు, శివారు ప్రాంతాల్లో కోడిపందేలు కొనసాగుతున్నాయి. ఇవి సంక్రాంతికి నిర్వహించే ప్రధాన పోటీలకు సన్నాహకంగా జూదరులు వ్యాఖ్యానిస్తున్నారు. గతేడాది కొన్ని బరుల్లో పందేలను ప్రోత్సహించేలా ద్విచక్ర వాహనాలను బహుమతిగా ఇచ్చారు. జోడు పందేల్లో విజేతలకు, జూదాల్లో కొందరు బరుల నిర్వాహకులకు ద్విచక్రవాహనాలు అందజేసి సన్మానించారు. ఈ ఏడాది కారును బహుమతిగా ఇవ్వాలని డెల్టా ప్రాంతానికి చెందిన ప్రముఖులు నిర్ణయించారు. గత రెండుమూడేళ్లుగా సంక్రాంతికి భీమవరం పరిసర గ్రామాల్లో కోడిపందేల నిర్వహణ పేరుతో చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరిగినా పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఈసారి జిల్లాలో ఎక్కడా జరగకుండా అవసరమైన అన్ని చర్యలు చట్టపరంగా తీసుకుంటామని నివేదికలు ఇచ్చారు. దీంతో కోడిపందేలు, జూదాలు నిర్వహించకూడదని పోలీసు యంత్రాంగం పదేపదే హెచ్చరికలు జారీచేసింది. కోడిపందేల నిర్వాహకులు,

కోడికత్తి కట్టే వ్యక్తులపై బైండోవర్ కేసులను ముందస్తుగా నమోదు చేసింది. తహశీల్దార్లు ఏ ప్రాంతంలో కోడిపందేల ఏర్పాట్లు జరగకుండా ప్రత్యేక నిఘా పెట్టింది. 144 సెక్షన్‌ను అమలులోకి తీసుకొచ్చారు. గత సంక్రాంతి పండుగ రోజుల్లో కోడిపందేలు, ఇతర జూదాలు విచ్చలవిడిగా జరిగాయని అందుకు కొందరు తహశీల్దార్లను బాధ్యులను చేస్తూ ప్రభుత్వపరంగా భూ పరిపాలన కమిషనర్ ఛార్జిమెమోలు ఇచ్చారు. దీనిపై తమ తప్పిదం ఏమిలేదని ఆటలు జరగకుండా విస్తృత ప్రచారం చేశామని.. బైండోవరు కేసులు నమోదు చేశామని తహశీల్దార్లు వివరణ ఇచ్చారు.

# కాంగ్రెస్‌లో అప్పుడే కుమ్ములాటు

## హామీలు నెరవేర్చే పరిస్థితి లేదు: కడియం- బిఆర్ఎస్‌ను టిఆర్ఎస్‌గా మార్చాల్సిందేనా?

హైదరాబాద్,జనవరి11కాంగ్రెస్ పార్టీలో అప్పుడే కుమ్ములాటలు మొదలయ్యాయని మాజీమంత్రి బిఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తానే రెండో స్థానం అంటున్నాడు. 2028లో బీఆర్ఎస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు సీఎం పదవి రాలేదని ఆయన భార్య వాపోతున్నదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా మారిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ 420 హామీలు నెరవేర్చే పరిస్థితి లేదన్నారు. బీఆర్ఎస్‌లో కేటీఆర్, హరీశ్ రావు కృష్ణార్జునులని స్పష్టం చేశారు. కార్యకర్తలకు అగ్ర నాయకత్వం అందుబాటులో ఉండాలని ఆయన తెలిపారు. దళితబంధు పథకాన్ని ఆపటం సరికాదని హితవు పలికారు. ఇప్పటికైనా లబ్దిదారులకు పథకాన్ని వర్తింపజేయాలని ఆయన సూచించారు.



హామీలు నెరవేర్చే పరిస్థితి ఉండదని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇదిలావుంటే తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా ఏర్పాటైన టిఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సమితి) పార్టీ పేరును మార్చడంపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి కీలక వ్యాఖ్యలు చేశారిన తెలుస్తోంది. బిఆర్ఎస్ (భారత రాష్ట్ర సమితి) పార్టీ పేరును తిరిగి టిఆర్ఎస్ మార్చాలని సూచించారని అంటున్నారు. పార్టీ అంతర్గత సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. కార్యకర్తలంతా అందుబాటులో ఉండి పార్టీని బలోపేతం చేసి పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ ఎన్నికలకు ముందు, కెసిఆర్ జాతీయ రాజకీయాల్లోకి అడుగు పెట్టాలనే నేపథ్యంలో జాతీయ ఫ్రంట్‌లో మరింత ఆకర్షణను కలిగి ఉండటానికి టిఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సమితి) పార్టీకి బిఆర్ఎస్ (భారత రాష్ట్ర సమితి) అని పేరు పెట్టారు. కానీ యాదృచ్ఛికంగా, జాతీయ రాజకీయాలు కలలు కన్న పార్టీ తెలంగాణలోనే అధికారాన్ని కోల్పోయింది. ఇప్పుడు ఆ పార్టీని టీఆర్ఎస్‌గా మార్చాలని బీఆర్ఎస్ నుంచి అంతర్గతంగా కలకలం రేగుతోంది. వచ్చే పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బిఆర్ఎస్ క్యాడర్ స్థానిక నాయకత్వాలతో వరస సమావేశాలు నిర్వహిస్తోంది. సమావేశానికి అధ్యక్షత వహించిన బిఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అభిప్రాయాన్ని సేకరించి పార్టీ ఉన్నతాధికారులకు తెలియజేశారు. బిఆర్ఎస్‌ను తిరిగి టిఆర్ఎస్‌లోకి మార్చాలనే డిమాండ్ పెరుగుతోందని కడియం హైకమాండ్‌కు తెలిపినట్లు సమాచారం. ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని కూడా చెప్పాడు. తెలంగాణ రాష్ట్ర సమితి స్థానికంగా పాతుకుపోయిందని కడియం మీడియాతో పేర్కొన్నారు.

# గత నెలలో ప్రపంచవ్యాప్తంగా 10 వేల కొవిడ్ మరణాలు

జెనీవా: క్రిస్మస్, థ్యాంక్స్ గివింగ్ సెలవుల్లో ప్రజలు గుమిగూడటంతో పాటు కొత్త వేరియంట్ వల్ల గత నెలలో కొవిడ్ మహమ్మారి వ్యాప్తి పెరిగిందని 'ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రేయేసస్ వెల్లడించారు.మహమ్మారి కారణంగా డిసెంబర్‌లో దాదాపు 10 వేల మరణాలు నమోదయ్యాయని తెలిపారు. కరోనా లక్షణాలతో ఆస్పత్రుల్లో చేరినవారి సంఖ్య 42 శాతం పెరిగినట్లు చెప్పారు. ముఖ్యంగా ఐరోపా, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా దేశాల్లో కరోనా వ్యాప్తి పెరిగినట్టు వెల్లడించారు.మహమ్మారి తీవ్రత అధికంగా ఉన్న సమయంతో పోలిస్తే గత నెల నమోదైన మరణాలు తక్కువే అయినప్పటికీ అవన్నీ నివారించదగినవని టెడ్రోస్‌అన్నారు. ప్రపంచవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో కరోనా కేసుల సంఖ్య పెరుగుతున్నట్లు తెలిపారు. కానీ, వాటిని అధికారికంగా నమోదు చేయడం లేదన్నారు. ఈ విషయంలో అన్ని దేశాలు అప్రమత్తంగా వ్యవహరించి.. బాధితులకు కావాల్సిన చికిత్స అందించాలని సూచించారు.ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జేఎన్.1 వేరియంట్ అత్యధికంగా ప్రబలుతోందని టెడ్రోస్ తెలిపారు. ఇది ఒమిక్రాన్ ఉప వేరియంట్ అయినందున.. ఇప్పటికే తీసుకున్న వ్యాక్సిన్లు కొంత వరకు రక్షణనిస్తాయన్నారు. అవసరమైనప్పుడు మాస్కులు ధరించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మహమ్మారి సోకకుండా వ్యాక్సిన్లు ఆపవని.. ఆస్పత్రుల్లో చేరే ముప్పు నుంచి మాత్రమే బయటపడేస్తాయని %ఔనూ% అత్యవసర విభాగాధిపతి మైఖేల్ ర్యాన్ తెలిపారు.

# పోలీసులకు చుక్కలు చూపిస్తున్న మొయినాబాద్ యువతి హత్య కేసు



రంగారెడ్డి జిల్లా, రంగారెడ్డి జిల్లా మోయినాబాద్ యువతి హత్య కేసులో సస్పెన్స్ వీడటం లేదు. నాలుగు రోజులుగా ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతూనే ఉంది. ఒక్క ఆధారం దొరకకుండా నిందితులు జాగ్రత్తపడటంతో కేసులో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు .హత్య చేసి చాకచక్యంగా తప్పించుకు తిరుగుతూ పోలీసులకే చుక్కలు చూపిస్తున్నారు.చనిపోయిన యువతి ఎవరు, ఎందుకు చంపారు, అసలు చంపిదెవరు అనే విషయాలపై ఇంకా స్పష్టత రావడం లేదు.
అసలేం జరిగిందంటే..మొయినాబాద్ మండలంలోని బాకారం గ్రామ శివారులో డ్రీమ్ వ్యాలీ రిసార్ట్‌కు వెళ్ళే మార్గంలో సోమవారం పట్టపగలే యువతిని హతమార్చి, పెట్రోల్ పోసి తగలబెట్టారు.మంటల్లో కాలిపోతున్న గుర్తు తెలియని మృతదేహాన్ని గమనించిన స్థానిక రైతులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకునే సమయానికి మృతదేహం కాలుతూనే ఉండడంతో రైతుల సాయంతో మంటలు ఆర్పారు. అప్పటినుంచి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటన స్థలంలో సగం కాలిపోయిన సెల్ ఫోన్ లభించగా.. దానిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. మృతురాలి వయసు 25 ఏళ్లు ఉంటుందని భావిస్తున్నారు.
పోలీసులకు ఈ కేసు సవాల్‌గా మారింది. ఏడు బృందాలను ఏర్పాటు చేసి విచారిస్తున్నా.. వివరాలు తెలియరావడం లేదు. బాధితురాలి ఫోన్ లభించినా.. అందులో సిమ్‌కార్డు తొలగించడం, మొయినాబాద్ చుట్టుపక్కల ఉన్న ఏ పోలీస్ స్టేషన్‌లో కూడా మిస్సింగ్ ఫిర్యాదు అందకపోవడంతో కేసును ఛేదించడం కష్టతరంగా మారుతోంది. మొబైల్ ఫోను పూర్తిగా కాలిపోవడంతో ఐఎంఈ నెంబర్ సిమ్ కార్డు గుర్తించే పనిలో ఉన్నారు పోలీసులు. ఆధారాలు లేకపోవడంతోనే దర్యాప్తులో ఆలస్యం అవుతుందని ఇటు పోలీసులు కూడా చెబుతున్నారు.
ప్రస్తుతం యువతి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీలో ఉంచారు. డ్రీమ్ వ్యాలీ రిసార్ట్ పరిసరాలను, సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. హత్య ప్రదేశంలో మరిన్ని ఆధారాల కోసం పోలీసులు, క్లూస్ టీమ్ జల్లెడపడుతోంది. ఆ యువతి ప్యాంట్ వెనక భాగం జేబుకు ఉన్న ఓ స్టిక్కర్ లభ్యమైంది.ఒక దారిలో వచ్చి మరో దారిలో నిందితుల పోయి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. యువతిని ఎక్కడో చంపి బైక్ మీద తీసుకువచ్చి ఇక్కడ కాల్చివేసినట్లుగా పోలీసులు అనుమానం చెందుతున్నారు

# ఈ ఆరు దేశాల పాస్‌పోర్టులు అత్యంత శక్తిమంతమైనవి..

భారత్ స్థానం ఎక్కడంటే?




ఢిల్లీ: ప్రపంచంలోనే 2024కిగానూ ఆరు దేశాల పాస్‌పోర్టులు అత్యంత శక్తిమంతమైనవిగా నిలిచాయి. వీటిలో ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, స్పెయిన్, జపాన్, సింగపూర్ ఉన్నాయి.
మంగళవారం విడుదలైన 'హెన్లీ పాస్‌పోర్టు సూచీ' నివేదికలో ఇవి తొలి స్థానంలో నిలిచాయి. 227 దేశాలతో కూడిన ఈ జాబితాలో భారత్ 80వ స్థానం దక్కించుకొంది.

తొలి స్థానంలో నిలిచిన ఆరు దేశాల పాస్‌పోర్టులతో ఏకంగా 194 దేశాలకు ముందస్తు వీసా లేకుండానే ప్రయాణించొచ్చు. గత ఐదేళ్లుగా ఈ సూచీలో సింగపూర్, జపాన్ తొలిస్థానంలో నిలుస్తున్నాయి. ఈసారి అదనంగా మరో నాలుగు దేశాలు వాటి సరసన చేరాయి. రెండో స్థానంలో ఉన్న దక్షిణ కొరియా, ఫిన్లాండ్, స్వీడన్ దేశాల పాస్ట్‌పోర్టులతో 193 దేశాలకు సౌకర్యవంతంగా వెళ్లొచ్చు. ఆస్ట్రియా, డెన్మార్క్, ఐర్లాండ్, నెదర్లాండ్స్ పాస్‌పోర్టులు మూడో స్థానంలో ఉన్నాయి. వీటితో 192 దేశాలకు వెళ్లేందుకు ముందస్తు వీసా అవసరంలేదు. 191 దేశాలకు ప్రయాణించే సౌకర్యం ఉన్న యూకే పాస్‌పోర్టు నాలుగో స్థానం దక్కించుకుంది.తాజా సూచీలో 80వ స్థానంలో ఉన్న భారత పాస్‌పోర్టుతో 62 దేశాలకు ప్రయాణించొచ్చు. గత ఏడాది 59 దేశాలు మాత్రమే ముందస్తు వీసా లేకుండా మన పాస్‌పోర్టుతో ప్రయాణించేందుకు అనుమతించాయి. దీంతో 2023లో మన దేశం ఈ జాబితాలో 85వ స్థానంలో నిలిచింది. 'హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్' ప్రకారం 2006లో భారత్ 71వ స్థానంలో ఉండేది. ఈసారి జాబితాలో అఫ్గానిస్థాన్ చివరి స్థానం(104)లో నిలిచింది. ఆ దేశ పాస్‌పోర్టుతో 28 దేశాలు మాత్రమే ఈ రకంగా అనుమతిస్తున్నాయి. దీని కంటే మూడు స్థానాలు మెరుగ్గా 101వ ర్యాంక్‌లో పాక్ పాస్‌పోర్టు ఉంది.దశాబ్ద కాలంలో యూఏఈ పాస్‌పోర్టు 55 నుంచి 11వ స్థానానికి ఎగబాకింది. ఉక్రెయిన్, చైనా 21 స్థానాలు మెరుగుపర్చుకున్నాయి. చైనా తాజాగా 62వ, ఉక్రెయిన్ పాస్‌పోర్టు 32వ స్థానంలో నిలిచింది. రష్యా పదేళ్లలో 24 స్థానాలు ఎగబాకి ఈసారి 51వ ర్యాంక్‌కు చేరింది. ఆ దేశ పాస్‌పోర్టుతో 119 దేశాలకు ముందస్తు వీసా లేకుండా వెళ్లొచ్చు.

# హనుమాన్ జంక్షన్

## స్థల వివాదంలో తన్నుకున్న జన సైనికులు



కృష్ణా జిల్లా: హనుమాన్ జంక్షన్‌లో జన సైనికులు రెచ్చిపోయారు. ఓ ప్రైవేట్ స్థలం సరిహద్దుపై గత కొన్ని నెలలుగా జనసేనకు చెందిన రెండు వర్గాల మధ్య వివాదం కొనసాగుతోంది.స్థల వివాదం సెటిల్‌మెంట్ చేస్తున్న సమయంలో ఇరు వర్గాలు సవాళ్లు విసురుకున్నాయి. కొట్టుకునేందుకు సమయం చెప్పి ఇరువర్గాలు ఘర్షణకు సిద్ధమయ్యాయి.గన్నవరం నియోజకవర్గం జనసేన ఇంఛార్జి చలమలశెట్టి రమేష్.. ఒక వర్గానికి నాయకత్వం వహించారు. ఆయన వర్గం ఓవైపు.. మరో వర్గం ఇంకోవైపు రోడ్డెక్కారు. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఎందుకు ఘర్షణ జరుగుతుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసున్న పోలీసులు ఇరువర్గాలకు సర్ధిచెప్పారు.

# దళితబంధు కోసం కొందరి ఆందోళన

నిజామాబాద్,జనవరి11 కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నెలరోజుల్లోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నదిని బిఆర్ఎస్ విమర్శిస్తోంది. ఈ క్రమంలో కొందరు దళితబంధు కోసం అంటూ దర్నాకు దిగారు. గత ప్రభుత్వం అమలు చేసిన దళిత బంధు పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అ దళితుల అభ్యున్నతి కోసం తీసుకొచ్చిన పథకాన్ని రద్దు చేయొద్దని డిమాండ్ చేశారు. గతంలో మంజూరైన యూనిట్లకు పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేయాలని కోరారు.
ఈ పథకం ద్వారా ఎంతోమంది దళితులు ఆర్థికంగా బాగుపడ్డారని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి దళితబంధు పథకం అమలయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో దళిత సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొన్నాయని అంటున్నారు. అయితే ఇదంతా బిఆర్ఎస్ ప్రోద్బలంతో జరిగిందని స్థానికులు విమర్శిస్తున్నారు.

# షర్మిల తెలంగాణ వాసి..

– ఏపిలో పదవి ఎలా కట్టబెడతారు
–కాంగ్రెస్ అధిష్ఠానానికి హర్షకుమార్ ప్రశ్న



రాజమండ్రి,జనవరి11 ఆంధ్రప్రదేశ్ పీసీసీ చీఫ్ పదవీని ఇటీవల పార్టీలో చేరిన వైఎస్ షర్మిలకు ఇచ్చే అవకాశం ఉండడంతో అప్పులే పెదవి విరుపులు మొదలయ్యాయి. పార్టీలో చేరే సమయంలో హైకమాండ్ పెద్దలు మాట ఇచ్చారని ప్రచారం జరిగింది. అయితే షర్మిలకు పార్టీ అధ్యక్ష పదవీ ఇవ్వొద్దని కొందరు నేతలు అంటున్నారు. ఏపీ కాంగ్రెస్‌లో రెబల్, మాజీ ఎంపీ హర్షకుమార్ ఈ నిర్ణయాన్ని బహిరంగంగా వ్యతిరేకించారు. 'షర్మిల తెలంగాణకు చెందిన వారు.
ఆంధ్రప్రదేశ్‌తో సంబంధం లేదు. ఇక్కడ పార్టీ పగ్గాలు అప్పగించడం సరికాదు. తెలంగాణ కోడలు అయినందున ఏపీ కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలను ఇవ్వొద్దని హర్షకుమార్ స్పష్టంచేశారు. అతని వ్యాఖ్యలపై ఇతర నేతలు, కాంగ్రెస్ హైకమాండ్ స్పందించాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌ను గద్దె దింపేందుకు దళితులు సిద్ధంగా ఉన్నారని హర్షకుమార్ అంటున్నారు.
ఫిబ్రవరి 8వ తేదీన రాజమండ్రిలో 'దళిత సింహగర్జన' నిర్వహిస్తున్నామని వివరించారు. వైసీపీ హయాంలో దళితులపై దాడులు ఎక్కువ అయ్యాయని గుర్తుచేశారు. కేసులు నమోదు చేశారని ఒక్కరికి కూడా న్యాయం జరగలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో తాను అమలాపురం లోక్ సభ నుంచి పోటీ చేస్తానని చెబుతున్నారు. ప్రస్తుతం ఏపీ పీసీసీ చీఫ్‌గా గిడుగు రుద్రరాజు ఉన్నారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఏపీలో కాంగ్రెస్ ప్రభావం పూర్తిగా తగ్గింది. ఒక్క అసెంబ్లీ, లోక్ సభ సీటును గెలవలేదు. వచ్చే ఎన్నికల్లో పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ హైకమాండ్ షర్మిలను రంగంలోకి దింపింది. పదవీపై ఇప్పటివరకు ప్రకటన చేయలేదు. పీసీసీ చీఫ్‌గా చేయొద్దని హర్షకుమార్ అంటున్నారు. దీనిపై హైకమాండ్ ఏం ఆలోచన చేయనుందో చూడాలి.

# సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయడమే నా లక్ష్యం: మంత్రి తుమ్మల

అశ్వారావుపేట: సీతారామ ప్రాజెక్టుతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం అవుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా పది లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందించనున్నట్లు చెప్పారు.ప్రాజెక్టులో భాగంగా సత్తుపల్లి మండలం యాతాలకుంట వద్ద జరుగుతున్న టన్నెల్ పనులను బుధవారం పరిశీలించారు.అనంతరం ప్రాజెక్టు అధికారులతో సమీక్షించి మీడియాతో మాట్లాడారు. "సీతారామ ప్రాజెక్టులో ప్రధానమైనది యాతాలకుంట టన్నెల్. పనులను రెండు వైపుల నుంచి చేసుకుంటూ రావాలి. ఆధునిక సాంకేతికతను వినియోగించి వేగంగా పనులు పూర్తి చేయాలి. టన్నెల్ పనులు పూర్తయితే బేతుపల్లి, లంకాసాగర్‌కు నీళ్లు అందుతాయి. గండుగులపల్లిలో నాలుగో పంప్ హౌస్ పనులు కొనసాగుతున్నాయి. సత్తుపల్లి నియోజకవర్గానికి యాతాలకుంట టన్నెల్ ప్రధానమైనది. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి. సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయడమే నా రాజకీయ లక్ష్యం" అని తుమ్మల తెలిపారు.

# వరంగల్ పార్లమెంట్ టికెట్ కేటాయించండి

## మాజీమంత్రి హరీష్ రావును కలిసిన చింతల యాదగిరి.





– వరంగల్ : పార్లమెంట్ ఎంపీ టికెట్ తనకు కేటాయించాలని ఉద్యమకారుడు, మాజీ కార్పొరేటర్, బేడ బుడగ జంగాల రాష్ట్ర జేఏసీ వైస్ చైర్మన్ చింత యాదగిరి మాజీమంత్రి హరీష్ రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ని కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2002 నుండి మలిదశ తెలంగాణ ఉద్యమం లో కీలకపాత్రపోషిస్తూ ఉద్యమకారుడుగా తెలంగాణ సాధనకై పోరాటం చేయడం జరిగిందన్నారు. పార్టీని నమ్ముకుని పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేయడం జరిగిందని తెలిపారు. ఎన్ని కేసులు పెట్టినా భరించుకుంటూ తెలంగాణ సాధించడానికి తన వంతు కృషి చేశానని అన్నారు. వరంగల్ జిడబ్ల్యూఎంసి కార్పొరేటర్ గా ప్రజలకు సేవలు అందించడం జరిగిందని తెలిపారు. బేడ బుడగ జంగాల రాష్ట్ర జేఏసీ వైస్ చైర్మన్ గా, బిఆర్ఎస్ సీనియర్ రాష్ట్ర నాయకులుగా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండడం జరుగుతుందని. తెలంగాణలో సుమారు 20 లక్షల బేడ బుడగ జంగాల ఓటు బ్యాంకింగ్ కలిగిన ఎస్సి కులానికి చెందిన తనకు మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రివర్యులు హరీష్ రావు గుర్తించి వరంగల్ పార్లమెంట్ సీట్ కేటాయించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో మెదక్ బేడ బుడజంగాల అధ్యక్షులు చింతల దశరథ తదితరులు పాల్గొన్నారు.

# జమ్ము మాజీ సీఎంకి త్రుటిలో తప్పిన ప్రమాదం

శ్రీనగర్: జమ్ము కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ సయ్యద్‌కి తృటిలో పెను ప్రమాదం తప్పింది. గురువారం ఆమె ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైంది.
అయితే ఆమె క్షేమంగా ఉన్నట్లు కూతురు ఇల్తిజా మీడియాకు తెలియజేశారు. గురువారం మధ్యాహ్నం అనంత్‌నాగ్ జిల్లా సంఘం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. ముఫ్తీ ప్రయాణిస్తున్న బ్లాక్ కలర్ స్కార్పియో వాహనం.. మరో కారును ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆమెకు ఏం కాలేదని తెలుస్తోంది.

# గ్రామపంచాయతీ డబ్బులు కనిపించకుండా పోయాయి

- డిపిఓకు పిర్యాదు చేసిన గ్రామ సర్పంచ్ సమ్మక్క భాస్కర్

- పిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన డీఎల్పిఓ ప్రభాకర్

రాయపర్తి, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: రాయపర్తి మండలం పోతిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి చేతివాటంతో గ్రామ పంచాయతీ డబ్బులు కనిపించకుండా పోయాయని గ్రామ సర్పంచ్ లకావత్ సమ్మక్క భాస్కర్ డిపిఓకు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ చేసిన పిర్యాదు మేరకు గురువారం డిఎల్పిఓ ప్రభాకర్, ఎంపిఓ రాంమ్మోహన్ గ్రామపంచాయతీకి చేరుకున్నారు. గ్రామపంచాయతీ క్యాష్ బుక్, తీర్మాన కాపీలను, ఇంటి పన్ను బుక్కులను పరిశీలించి, రికార్డులను తమతో పాటు తీసుకువెళ్లారు. క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేపట్టి డబ్బులు కనిపించకుండా పోవడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ డిజిటల్ సంతకాలు ఉండటం వల్ల జిపి 15వ, ఫైనాన్స్ నిధులు, గ్రామపంచాయతీ తీర్మాణాలు, రికార్డులు, బిల్లులు లేకుండానే డబ్బులు విడుదల చేసి, గ్రామపంచాయతీ కార్యదర్శి సొంత ప్రయోజనాలకు ఉపయోగించుకున్నట్లు ఆరోపించారు. గ్రామస్తులు చెల్లించిన ఇంటి పన్నులు, నల్ల పన్నుల డబ్బులు ఎస్టిఓలో జమ చేయకుండ సుమారు 70 వేల రూపాయలు తమ సొంత ఖర్చులకు ఉపయోగించుకున్నారని వివరించారు. పంచాయతీ కార్యాలయంలో ఎలాంటి రికార్డులు సరిగా రాయడం లేదని అన్నారు. ఈ మధ్య కాలంలో బర్రెలను వేలం పడితే వచ్చిన సుమారు 60వేల రూపాయలను క్యాష్ బుక్కులో నమోదు చేయలేదని చెప్పారు. గ్రామపంచాయతీ రికార్డులను గత కొంత కాలంగా ఆడిట్ చేయించడం లేదన్నారు. ఆడిట్ కు ఎన్నిసార్లు పిలిచినా రావడం లేదని



అన్నారు. గ్రామ అభివృద్ధికి ఉపయోగించే డబ్బులను సొంత ప్రయోజనాల కోసం వాడుకున్న గ్రామపంచాయతీ కార్యదర్శిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఆకస్మిక తనిఖీలు చేపట్టిన పోలీసులు



వర్ధన్నపేట, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని జనరల్ స్టోర్, పాన్ షాపు, కిరాణా షాపుల్లో గురువారం వర్ధన్నపేట పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారు. మత్తు పదార్థాల నిర్మూలనకై తనిఖీలు
చేపట్టాలని పోలీస్ కమిషనర్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ విభాగాలకు ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. వారి ఆదేశానుసారం వివిధ దుకాణ, సముదాయాల్లో తనిఖీలు ప్రారంభించినట్లు వర్ధన్నపేట సిఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు ప్రవీణ్ కుమార్, విజయ్ కుమార్, మహేందర్ ఏ ఎస్సైలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన కారు

### - ఒకరు మృతి, మరొకరి తీవ్ర గాయాలు



రాయపర్తి, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: రాయపర్తి మండల కేంద్రం వరంగల్, ఖమ్మం జాతీయ రాహదారిపై గురువారం అదుపు తప్పిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన ఘటన చోటు చేసుకుంది. ఎస్సై విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం జరిగిన ప్రమాదంలో ఐదేళ్ల బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి.

వివరాల్లోకి వెళితే రాయపర్తి మండలం పన్యా నాయక్ తండాకు చెందిన భానోతు రమేష్, అతని కుమారుడు బానోతు యాకేష్ లుగా గుర్తించారు. ద్విచక్ర వాహనంపై రాయపర్తి వైపు వెళుతున్న క్రమంలో రోడ్డు ప్రమాదం సంభవించిందని చెబుతున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి గురైన క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 ద్వారా వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ కి తరలించారు. హాస్పిటల్ వెళుతుండగా మార్గ మధ్యలో బాలుడు మృతి చెందాడు. బాధితుడు రమేష్ భార్య సింధు పిర్యాదు మేరకు కేస్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.

## సిపిఐ నాయకులు దొంతరబోయిన యాకయ్య మృతి

### - నివాళులు అర్పించిన సిపిఐ నాయకులు



రాయపర్తి, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: రాయపర్తి మండలం తిర్మలాయపల్లి గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు దొంతరబోయిన యాకయ్య గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న సిపిఐ పార్టీ మండల పార్టీ కార్యదర్శి గాజు యాకయ్య నివాళులు అర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట వర్ధన్నపేట మండల సిపిఐ పార్టీ గౌరవ అధ్యక్షులు మునిగాల వేణు, కార్యదర్శి ఎండి హైమద్, సిపిఐ నాయకులు బండి ఉప్పలయ్య, గబ్బెట నర్సయ్య, చొప్పర రవి, చొప్పర వెంకన్న తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు




వర్ధన్నపేట, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వర్ధన్నపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాదు రమేష్ తెలిపారు. ఈనెల 12వ, తేదీ నుండి 17వ, తేదీ వరకు ప్రభుత్వం సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో పాఠశాల ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి, సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ముగ్గుల పోటీలలో విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంతో పాల్గొని రంగురంగుల ముగ్గులతో పాఠశాల ఆవరణాన్ని అలంకరించారు. ముగ్గుల పోటీలో భాగంగా సాంప్రదాయబద్దమైన ముగ్గులు వేసిన వారికి మహిళా ఉపాధ్యాయులు జడ్జిలుగా వ్యవహరించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కేటాయించి విద్యార్థులకు జనవరి 26వ, తేదీన రిపబ్లిక్ డే సందర్భంగా బహుమతులను ప్రధానం చేయనున్నట్లు ప్రధానోపాధ్యాయులు రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పసునూరి నర్సయ్య, డి రాజకుమారి, తిరుమల, అనిత, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రికల్ సైకిల్స్ పంపిణీ చేసిన రామగుండం ఎమ్మెల్యే



పెద్దపల్లి, గోదావరిఖని, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి:
గోదావరిఖని గాంధీ నగర్ రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ క్యాంపు కార్యాలయంలో చండీయాగం పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నలుగురు వికలాంగులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఎలక్ట్రికల్ సైకిల్స్ పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గంలోని ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రజల సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. సంక్రాంతి పండుగను ప్రజల కుటుంబ సమేతంగా, సంతోషంగా జరుపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీ పథకాల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 10 లక్షల ఆరోగ్యశ్రీ ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేశారని కొనియాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ప్రజాపాలన తీసుకువచ్చి ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో నియోజకవర్గాన్ని, అభివృద్ధి చేయడానికి ముందుకు వెళ్తామన్నారు. నిరుపేద లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఖచ్చితంగా అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నాలుగో తరగతి ఉద్యోగుల ఎన్నికలు




వర్ధన్నపేట, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: వర్ధన్నపేట నాలుగో తరగతి ఉద్యోగుల సమితి ఎన్నికలు రేపు నిర్వహిస్తున్నట్లు వర్ధన్నపేట అధ్యక్షులు తెలిపారు. గురువారం వారు తెలిపిన వివరాల మేరకు వర్ధన్నపేట సమితి పరిధిలోని రాయపర్తి, పర్వతగిరి, వర్ధన్నపేట మండలాలకు చెందిన నాలుగో తరగతి ఉద్యోగులు (అటెండర్లు) సమితి ఎన్నికలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కమిటీ అధ్యక్షులు ఎల్ సంతోష్, కార్యదర్శి బోలే షావలి, కోశాధికారి ఏ కుమారస్వామిలు హాజరుకానున్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారులుగా ఎర్ర శ్రీనివాస్, పి వెంకట్రావులు వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. మూడు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలు,
మండల పరిషత్ కార్యాలయంలో పనిచేసే అటెండర్లు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట సమితి కార్యదర్శి కంచర్ల ప్రభుదాస్, సభ్యులు కొత్తపెల్లి రవీందర్, సుమన్, వెంకన్న, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వివేకానంద 161వ, జయంతి



వర్ధన్నపేట, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో గురువారం స్వామి వివేకానంద 161వ, జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ వర్ధన్నపేట శాఖ ఆధ్వర్యంలో వివేకానంద విగ్రహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పట్టణ కేంద్రంలో ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బెల్లం కార్తీక్ మాట్లాడుతూ ఉక్కునరాలు, ఇనుప కండరాలు కలిగినటువంటి యువతకు వివేకానంద ఎంతో ఆదర్శం అన్నారు. వివేకానంద విదేశాలకు వెళ్లి భారత దేశ గొప్పదనం రానున్న రోజుల్లో ఎలా ఉంటుందో చెప్పడం జరిగింది. వివేకానందుని స్ఫూర్తిగా తీసుకొని ఈరోజు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ పనిచేస్తుందన్నారు.
ఈ కార్యక్రమంలో కార్యకర్తలు అజయ్, శశాంక్ , రాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గోదావరిఖని సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లు ముమ్మరం




పెద్దపల్లి, గోదావరిఖని, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి:
గోదావరిఖని బ్రిడ్జి సమీపంలోని సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద జాతర ఏర్పాట్లు అధికారులు ముమ్మరం చేస్తున్నారు. గురువారం వారు తెలిపిన వివరాల మేరకు వచ్చేనెల ఫిబ్రవరి 21 నుండి 24వ, తేదీ వరకు జాతర ఘనంగా నిర్వహిస్తారు. భక్తుల సౌకర్యాల ఏర్పాటుకు సింగరేణి, మున్సిపల్, పోలీస్ సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. ఈ జాతరను తెలంగాణలో రెండవ మేడారం జాతరగా పిలుస్తుంటారు. గోదావరిఖని నదీ తీరాన సమ్మక్క సారలమ్మ జాతరకు భక్తులు భారీగా వస్తారని తెలిపారు. వారి వెంట గోదావరిఖని సమ్మక్క సారలమ్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఏసీపీ తుల శ్రీనివాస్, రామగుండం ఎమ్మార్వో కుమారస్వామి, రామగుండం కార్పొరేషన్ కమిషనర్ నాగేశ్వర్, టూటౌన్ సీఐ సూరం వేణుగోపాల్, కమిటీ సభ్యులు మోహన్ రెడ్డి, ఎం నగేష్, ఈశ్వర్, ఆశలు, లక్ష్మీనారాయణ, నారాయణ, రాజమల్లు, తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## యువత చైతన్యదీప్తిగా సాగాలి !

చాలామంది యువతలో ఆత్మస్థయిర్యం ఉండడం లేదు. ఉద్యోగం రాలేదనో..ప్రేమించిన అమ్మాయి కాదన్నదనో..చదవుకు డబ్బులు లేవనో..ఇలా ఆత్మన్యూనతతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. చిన్నిచిన్న కారణాలతో పెద్దదైన జీవితాన్ని కోల్పోతున్నారు. ఈ ప్రపంచం విశాలమైనది. చిన్నచిన్న విషయాలకు కుంగిపోతే పెద్ద లక్ష్యాలను సాధించలేం. అలాంటి వారు వివేకానందను స్ఫూర్తిగా తీసుకో వాలి. చిన్న వయసులోనే ఎన్నో విజయాలు సాధించిన ఉదాత్తమూర్తి స్వామి వివేకానంద. ప్రపంచానికే స్ఫూర్తిగా నిలిచిన మహనీయుడు ఆయన. నేటి యువతకు స్వామి వివేకానంద బోధనలు అనురణీయం. నిర్వీర్యమై, నిరాశా నిస్పృహాలో కొట్టుమిట్టా డుతున్న యువత మేల్కోవాలి. భారత దేశంలోఎందరో మహానుభావులు అప్పుడప్పుడూ తళుక్కున మెరిసి జాతిని మేల్కొలిపారు. సమాజాన్ని రుజువర్తనలో పెట్టే ప్రయత్నాలు చేశారు. ఆ తరవాత వారి అడుగు జాడల్లో నడిచి దేశాన్ని ముందుకు తీసుకుని వెళ్లిన వారూ ఉన్నారు. అలాంటి మహానుభావుల్లో స్వామి వివేకానందుడు అగ్రగణ్యుడు అని చెప్పక తప్పదు. వివేకానందుడు హిందూసమాజ పునరుజ్జీవ నానికి, సాంస్కృతిక జాతీయవాదాన్ని శక్తిమంతం చేయటానికి చేసిన కృషి అనన్య సామాన్యం. ఆయన బోధనలు ఇప్పుడు ప్రపంచ మానవాళి అనుసరిస్తూ ముందుకు సాగుతోంది. నిరాశలో కూరుకుపోయిన నేటియువత మేల్కో వాలి. జాతిని జాగృతం చేసే బాధ్యతను తీసుకోవాల్సి ఉంది. వివేకానందుడు ఒక ఆధ్యాత్మిక వేత్త, దార్శనికుడు, సామాజిక పరివర్తకుడు. విచ్ఛిన్న కర శక్తుల ప్రాబల్యం పెరుగుతున్న క్రమంలో దేశాన్ని జాగృతం చేయాల్సిన అవసరం ఇప్పుడే ఉంది. తమకోసం..తమవారి కోసం ..ఈ దేశంకోసం వారు నడుం బిగించాల్సి ఉంటుంది. దేశాన్ని రక్షించుకో వాల్సిన అవసరం మేరకు అడుగులు వేయాలి. స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలి. జాతిని జాగృతం చేసి దేశ ఐక్యతకు నడుంబిగిస్తేనే ..నవశకం ఆరంభం కాగలదని గుర్తించాలి. మహాత్ముల జీవితాలను చదవి ఉత్తేజితం కావాలి. ప్రయత్నం చేసి ఓడిపో కానీ ప్రయత్నం చేయడంలో మాత్రం ఓడిపోకు.. అంటాడు స్వామి వివేకానంద.. ఆయన మాటలన్నీ ప్రేరణకు స్ఫూర్తిగా నిలిచేవే.



భారతదేశాన్ని చదవాలంటే వివేకానందుణ్ని చదివితే చాలు. రామకృష్ణ పరమహంస వద్ద నాలుగేళ్ల శుశ్రూషలో నరేంద్రుడు నేర్చుకున్న ఆదర్శాలే తరవాత అతడిని మహనీయుడిగా తీర్చిదిద్దాయి. సంపద సృష్టికర్తలైన శ్రామికులే ఈ దేశ ఆశాకిరణాలని స్వామి వివేకానంద ఆనాడే చెప్పారు. 18, 19 శతాబ్దాల్లో స్తబ్ధమైన భారతీయ సమాజాన్ని మేల్కొల్పడానికి రాజారామ్ మోహన్‌రాయ్, కేశవచంద్రసేన్, దయానంద సరస్వతి సారథ్యంలో కొనసాగిన సంస్కరణోద్యమాన్ని వివేకానందుడు గొప్ప ముందడుగు వేయించాడు. అనేక ప్రాచీన చింతనా ధోరణు లను స్ఫూర్తిగా తీసుకొని స్పష్టమైన దృక్పథంతో కార్యాచరణతో జ్ఞాన విప్లవాన్ని వివేకానందుడు ఆరంభించాడు. వ్యవస్థీకృతమైన రుగ్మతలను ఎదిరించడం, సంస్కరించడం వంటి వివేకానందుడి విప్లవా త్మక భావాలు ఇప్పటికీ అనుసరణీయంగా ఉన్నాయి. మృత ప్రాయంగా ఉన్న వ్యవస్థకు కొత్త ఊపిరిపోసి, కొత్త నెత్తురు ఎక్కించిన పునరుజ్జీవన, జాతీయోద్యమ, విప్లవోద్యమ కేంద్ర స్థానమైన బెంగాల్ మాగాణంలో ఉద్భవించిన మేధావి వివేకానందుడు. మనషిలో నిగూఢమై ఉన్న పరిపూర్ణ త్వాన్ని వ్యక్తం చేయించేది విద్య అని వివేకానందుడు నిర్వచించాడు. జీవితాన్ని నిర్మించడమూ, సద్గుణ సంపన్నులైన మనుషులను రూపొందించడమూ విద్య ఆశయాలుగా ఆయన పేర్కొన్నాడు. విద్యలో సమాన అవకాశాలను కల్పించిన ప్రాచీన నలంద, తక్షశిల, విక్రమశిల, వల్లభి విద్యలయాల సుసంపన్న సంప్రదాయాన్ని పునఃప్రతిష్ఠింప చేయాలని, ప్రభుత్వము, పౌరసమాజం విద్యను అందించడమే ప్రథమ

కర్తవ్యంగా చేపట్టాలని ప్రజలను చైతన్యవంతం చేశాడు. ఆ నాటి సమాజంలో వ్యవస్థీకృతమైన రుగ్మతలను ఎదిరించడం సంస్కరించడం వంటి వివేకానందుడి విప్లవాత్మక భావాలు ఇప్పటికీ ప్రాసంగికతను కలిగివున్నాయి. పునరుద్ధరణవాద, తిరోగమన, విచ్ఛిన్నకర శక్తుల, సామాజిక బాధ్యత లేని పెట్టుబడి దారీ శక్తుల ప్రాబల్యంతో పేదరికం, అశాంతి, అసహనం నెలకొన్న ప్రస్తుత సమాజాన్ని మానవత్వం వైపు మళ్ళించడానికి వివేకానందుని కృషిని కొనసాగించడమే మార్గం. దేశం పరాయిపాలన నుంచి విముక్తం అయ్యాక స్వార్థ రాజకీయ శక్తుల చేతుల్లో ఓడిపోతోంది.

ఈ క్రమంలో యువత బాగా ఆలోచించాలి. పేదరికం, అశాంతి, అసహనం నెలకొన్న ప్రస్తుత సమాజాన్ని మానవత్వం వైపు మళ్ళించడానికి వివేకా నందుని కృషిని కొనసాగించడమే మార్గంగా ఎంచుకోవాలి. పేదవాని కష్టంతో పైకి వచ్చిన పాలకులు.. వారి బాగోగులను పట్టించుకోవడం లేదు. ఎప్పుడో వివేకానందుడు ఇలాంటి వన్నీ తన ప్రసంగాలతో ప్రపంచాన్ని ఉర్రూత లూగించారు. ఎంతో తత్వజ్ఞానం పొందిన స్వామి వివేకానంద మనలో ఉన్న జాడ్యాన్ని తొలగించి... ఉత్తేజితం చేసి ప్రేరణ కల్పించడానికి పుట్టిన ఓ మహాయుగకర్తగా భావించాలి. ప్రతి మతంలోను,ప్రతి సిద్ధాంతంలోను, ఎంతో కొంత మంచి వుంటుంది. సోదరప్రేమ గురించి ప్రసంగాలు మాని, ఆ ప్రేమను కార్యరూపంలో ప్రదర్శించండని పిలుపును ఇవ్వడమే కాదు....

ఆచరించి చూపాడు. వివేకానందుడు ప్రవచించిన మార్గం ఎప్పటికీ అనుసరణీయమే. దరిద్ర నారాయణసేవే పరమధర్మమని వివేకానందుడు అంటారు. మానవాళికి చైతన్య దీప్తిగా స్వామి వివేకానంద విశ్వవిఖ్యాతి పొందినాడు. కర్మ, భక్తి, రాజ, జ్ఞాన యోగాలపై ఆయన చేసిన రచనలు ఆత్మశక్తిని వెలికితీసే ఆయుధాలు. గాంధీలాంటి అహింసా మూర్తులకూ, సుభాష్ చంద్రబోస్, అరవింద్ ఘోష్, జతిన్‌దాస్ లాంటి అతివాదులకూ వివేకానందుడు స్ఫూర్తిగా నిలిచారు. అలాంటి బాటలో మనమెందుకు నడవకూడదన్న ఆలోచన చేయాలి. ప్రాచీన కాలపు గ్రీసులో సోక్రటీసు గొప్ప గురువు. ప్లేటో గొప్ప శిష్యుడు. గురువంటే రామకృష్ణుడు. శిష్యుడంటే వివేకానందుడు అలా ఉద్భవించారు. ప్రజలు విద్యకు, విజ్ఞానానికి దూరంగా మూఢవిశ్వాసాలకు ,దారుణ సాంఘిక దురాచార కబంధహస్తాల్లో నలిగి పోవడం చూడలేక చైతన్యదీప్తి రగిలించాడు.భారతీయ మూలాల నుండి నిజమైన వేదాంత దృక్పథాన్ని రూపొందించి, జాతి


# యువతకు చోదశక్తిగా స్వామి వివేకానంద

## చికాగో ప్రసంగంతో ప్రపంచ మేధావిగా గుర్తింపు - స్వామితో ప్రేరణ పొందిన సిస్టర్ నివేదిత

కోల్‌కతా,జనవరి11

బలహీనతల్ని తొలగించుకో. పౌరుషాన్ని ప్రసాదించుకో. మనిషిగా మసలుకో. లే..... లెమ్ము అంటూ యువతను జాగృతం చేసిన వేదాంతభేరి స్వామి వివేకానంద. భారతదేశాన్ని ప్రేమించడమెలాగో, ఉద్ధరించడమెలాగో నేర్పిన మహనీయుడు స్వామి వివేకానంద! దేశ ప్రజలందరికి ఆత్మవిశ్వాసం క్రియా శూరత్వం కావాలి. ఈ అవసరం నాకు స్పష్టంగా కనిపిస్తుంది అని నొక్కి

చెప్పారు. భగవంతుడి పట్ల నమ్మకం లేనివాడు నాస్తికుడు అనేది ఒకప్పటి మాట. వివేకానందుడు గొప్ప తాత్వికుడు. అతని ముఖ్య బోధనల ప్రకారం అద్వైత వేదాంతం తత్వ శాస్త్రములోనే కాకుండా, సామాజికంగా రాజకీయంగా కూడా ఉపయోగ పడుతుంది. అందుకే ఆయన చికాగో సర్వమత సమ్మేళనంలో చేసిన ప్రసంగం నేటికీ చిరస్మరణీయంగా నిలిచిపోయింది. మహోన్నతమైన ఆదర్శం ఎన్నుకుని నీ జీవితాన్ని మలుచుకోవాలని అంటాడు. భారతదేశ ఘనతను వర్ణిస్తూ ఆయన ఒక్కడే తన ప్రసంగం ద్వారా ప్రపంచానికి చాటిచెప్పాడు. విశాలమై అనంత విస్తృతిని పొంది తోటి మానవ జాతినే కాక పశుపక్ష్యాదులతో సహా సమస్త ప్రాణికోటి చేత సర్వజగత్తు ఉచ్ఛంనీచం లేకుండా తనతోనే ఉన్నట్లు భావించాలని అంటారు. సరిగ్గా గీతోపదేశంలో శ్రీకృష్ణ పరమాత్ముడు బోధనలను ఆయన తన వాక్యాల్లో సూటిగా చెప్పారు. మనిషిలో అహం తగ్గి, ఇతరులను ప్రేమించాలన్న భారతీయ ఐతిహ్యాలకు ప్రతీకగా వివేకానందుడి ఉపన్యాసాలు ప్రేరణగా నిలిచాయి. అందరు తనవారనుకుంటేనే నిజమైన స్వేచ్ఛ లభిస్తుందనే వేదాంత తత్వానికి చెందిన వ్యక్తి వివేకానందుడు. ఆయన బోధనలు, అనుసరించిన మార్గాలు నేటికీ యువతకు ప్రేరణగా నిలుస్తాయి. పిరికితనానికి మించిన మహాపాపం ఇంకోటి లేదు. ఒక దెబ్బతింటే రెట్టింపు ఆవేశంతో పది దెబ్బలు కొట్టాలి, అప్పుడే మనిషినని అనిపించుకొంటావు. పోరాడుతూ చనిపోయినా ఫర్వాలేదు. కాని పోరాటం అవసరం అంటాడు. ఆత్మవిస్వాసం లేకపోవడం అనేది క్షమించరాని నేరం. గొప్ప వ్యక్తుల జీవతాలన నిశితంగా పరిశీలిస్తే వారిని నడిపించింది ఆత్మవిశ్వసమేనని తెలుస్తుంది. ప్రేమ... డబ్బు... జ్ఞానం.. చదువు... దేనికోసమైనా తపనపడుతూ పిచ్చివాడై పోయేవాడికి అది తప్పకుండా దొరుకుతుందంటాడు. అందుకోసం మనం ఉడుంపట్టు లాంటి పట్టుదల, సంకల్పబలం, శ్రమించే తత్వం కనబర్చాలని ఉద్బోధించాడు. అతడి జీవితంపై రామకృష్ణ పరమహంస ప్రభావం ఎంతగానో ఉంది. సామాన్యుడిగా ఉన్న నరేంద్రుడు వివేకానందుడిగా మారడానికి గురువుగా రామకృష్ణ పరమహంస ఎంతగానో ప్రభావితం చేస్తాడు. జీవితంలో గురువు అవసరం ఎంతగా ఉంటుందో పరమహంస వల్ల తెలుస్తుంది. పేదవారి సేవతో భగవంతుని సేవ అనే పదాన్ని ప్రతిపాదించి అది వివేకానందుడికి బోధించడం వల్లనే ఇవాళ రామకృష్ణ ఆశ్రమాలు సేవలో తరిస్తున్నాయి. వ్యక్తిగత మోక్షం పై వ్యామోహం కూడా వదిలివేసి, ఇతరులను బంధవిముక్తులను చెయ్యడమే మనిషికి జ్ఞానోదయము అని నమ్మిన మనిషి రామకృష్ణ పరమహంస. అదే వేదవాక్కుగా జీవించి దరిద్ర నారాయణులకు సేవచేయడమే పరమౌషధమని నమ్మిన వ్యక్తి వివేకానందుడు. వేదాంత



సారాన్ని ఒక్కముక్కలో రామకృష్ణుడు చేసిన బోధనలు వివేకానందుడి గతిని మార్చాయి. అందుకే స్వామి వివేకానందను కలుసుకొని, ఆయన సాంగత్య భాగ్యం పొందిన విషయాలను ఘనంగా చాటారు సిస్టర్ నివేదిత. ఆయన ప్రభావం పాశ్చాత్యదేశాల వైఖరినే ఆమూలాగ్రం మార్చివేసి ఉంటుందని సోదరి నివేదిత వ్రాసింది. పాశ్చాత్య దేశాలకు మాత్రమే కాదు, భారతదేశానికి మాత్రమే కాదు, ప్రపంచానికే అన్వయించే భావన స్వామిది. స్వామి వివేకానంద అమృత వాక్కులు నిత్యసత్యాలు.

# వివేకానంద స్ఫూర్తితో రామకృష్ణ మఠం

## విద్యారంగంలో ఎందరికో ఆదర్శం -స్వామి బోధమయానంద వెల్లడి

హైదరాబాద్,జనవరి11 మానవుని నైతిక, ధార్మిక ప్రవర్తనే కీలకమని వివేకానందుడు చెప్పారు. యువతను జాగృతం చేసి, వారిలో ఆత్మస్థయిర్యాన్ని నింపి ముందుకు నడిపిన వారిలో స్వామి వివేకానంద అగ్రగణ్యుడు. యువత రాన్ని ప్రేరేపించిన మహాశక్తి, గొప్ప వ్యక్తి స్వామి వివేకానంద అని హైదరాబాద్ రామకృష్ణమఠం స్వామి బోధమయానంద అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ రామకృష్ణ మఠం ఇప్పుడు విద్యార్థులకు ఆలంబనగా నిలిచింది. ఎన్నో రంగాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇంగ్లీష్‌తో పాటు ప్రపంచ భాషల్లో ఇక్కడ ఉచిత శిఓణ పొందే వీలుంది. అనేక రంగాల్లో కోర్సులను ప్రవేశ పెట్టి యువతను సన్మార్గంలో నడిచేలా చేస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు ఇప్పుడు విదేశాల్లో స్థిరపడ్డారు. పతనం నుంచి ఈ ప్రపంచాన్ని ముందుకు తీసుకెళ్ళడానికి వివేకానందుడు ప్రపంచాన్ని చైతన్యవంతం చేయటానికి ప్రయత్నించారు. విలువల దార్శనికతతో సమాజాన్ని ఉన్నతస్థితికి తీసుకొనిపోలేకపోతే భౌతిక సంపద తెచ్చిపెట్టే ప్రగతి పతనం వైపు దారితీస్తుంది. అందుకే భౌతికవాదానికి కొనసాగింపుగా ఆధ్యాత్మికత



అవసరమని వివేకానంద భావించారని వివరించారు. మన మత వ్యవస్థలను హేతుబద్ధమైన, చైతన్యశీలమైన వేదాంతపు తర్కంతో విప్లవీకరించారు.అందుకే వివేకానందుడు చోదక శక్తిగా నిరంతరం యువతకు మేలుకొలుపుగా ఉంటాడు. గొప్ప అవకాశాలే వస్తే ఏమి చేతకాని వారు కూడా ఏదో గొప్ప సాధించ వచ్చు. కానీ ఏ అవకాశాలూ లేనప్పుడు కూడా ఏదైనా సాధించాలనే పట్టుదల ఉన్నవారే గొప్పవారు కాగలుగుతారు. ఇలాంటి కోవలోకి స్వామి వివేకానంద వస్తారు. అనంత శక్తి, అపారమైన ఉత్సాహం, అమేయ సాహసం, అఖండ సహనం ఇదే మనకు కావలి. వీటితోనే ఘనతను సొంతం చేసుకోగలం. వెనక్కి చూడకండి ముందడుగే వేయండి. అన్న సూక్తిని పాటించేలా జనాన్ని జాగృతం చేసిన మహనీయుడాయన. అన్నింటికి మించి పట్టుదలే మనిషిని మనీషిగా మారుస్తుందని ఉద్బోధిస్తాడు. దైవ విశ్వాసం కంటే మానవ విశ్వాసం ముఖ్యమని బోధిస్తాడు. ముక్కోటి దేవతలలోనూ నమ్మకమున్నా నీలో నీకే విశ్వాసం లేకపోతే నీకు ముక్తి లేదంటాడు. ఆయన భావజాలంతో సాగుతున్న జాతిపునర్నిర్మాణ కార్యంలో పాల్గొని రామకృష్ణ మఠం లాంటి సంస్థలు, వ్యక్తులు ఇప్పటికీ నిరంతరంగా శ్రమిస్తున్నాయి. భారతదేశంలో వేల సంవత్సరాలనుండే ఒక మనిషి జీవితానికి లక్ష్యం చతుర్విధ పురుషార్థాలుగా ధర్మం, అర్థం, కామం, మోక్షం అని చెప్పారు. భౌతికసుఖాలు, సంపదలు వద్దనలేదు. అందులోనే మునగకుండా సత్యాన్వేషణలో మోక్ష సాధనకు కృషిచేయాలని చెప్పారు. వివేకానందుని వ్యక్తిత్వాన్ని, సందేశాన్ని సామ్యవాద దేశాలు కూడా ప్రస్తుతించాయి. రష్యా, చైనాలలో వివేకానందుని 120వ జయంతిని అధికారికంగా నిర్వహించారు. సామాజిక పరివర్తన అనే ఇంజనుకు తగిన ఇంధనం వేదాంతమేనని వివేకానందుని స్పష్టమైన అభిప్రాయం. ఆయన సామాజిక చింతనలో మరో స్పష్టత 'జాతీయ సమస్యల పరిష్కారానికి ఉన్నత స్థానంలో ఉన్న వారిని పడగొట్టటం కాదు, దిగువన ఉన్న వారిని ఉన్నతస్థితికి తీసుకొనివెళ్ళటం అన్నదే స్వామి లక్ష్యం. హిందుత్వంపై వివేకానంద గర్వ్‌సే కహో హమ్ హిందూ హై అని చెప్పారు. అలా చెబితే వేల సంవత్సరాల మన మహాపురుషుల పరంపర, చరిత్ర, సంస్కృతులు మనకు గుర్తువస్తాయి. వివేకానందుడు హిందూ సమాజ పునరుజ్జీవనానికి, సాంస్కృతిక జాతీయవాదాన్ని శక్తిమంతం చేయటానికి కృషి చేశారు. ఆయన ఒక ఆధ్యాత్మిక వేత్త, దార్శనికుడు, సామాజిక పరివర్తకుడు. వివేకానందునికి సత్యసిద్ధాంతమైన

వేదాంతం ముఖ్యం. 'ఈ దేశం బాగుపడాలంటే జనసామాన్యాన్ని జాగృతపరచాలి. మన జాతి చేసిన అతిపెద్ద పాపం జన సామాన్యాన్ని నిర్లక్ష్యం చేయడం. వారిని ఎదగనిస్తే సమాజం బాగుపడు తుంది. వారికి సకారాత్మకమైన విద్య నందిస్తూ జాగృతం చేయటం మనందరి కర్తవ్యమని' వివేకానందుడు చెప్పేవారు. అందుకే 'దరిద్రదేవోభవ' అన్నది ఆయన మంత్రమయ్యింది. వివేకానందుడు సాంస్కృతిక జాతీయవాదానికి పెద్దపీట వేసాడని బోధమయానంద వివరించారు. స్వామి బోధనల మేరకు హైదరాబాద్ మఠం విశేషంగా కృషి చేస్తోందని అన్నారు. అనేక రంగాల్లో విశేషంగా సేవలు అందిస్తోంది.

# రామకృష్ణ సమాధే మఠంగా మార్పు

## నేటికీ ప్రపంచ ప్రఖ్యాత మఠంగా సేవలు

కోల్‌కతా,జనవరి11: రామకృష్ణ పరమహంస చనిపోయిన తరువాత ఆయన శిష్యులందరూ కలిసి బరనగూర్‌లోని ఒక అద్దె ఇంట్లో నివాసం ప్రారంభించారు. ఆ ఇల్లు చాలా పాతది అయినప్పటికీ నగరం రణగొణ ధ్వనులకు చాలా దూరంగా గంగానది ఒడ్డున ఉండేది. అక్కడి నుండి రామకృష్ణుల వారి సమాధి చాలా దగ్గరగా ఉండేది. అక్కడే రామకృష్ణ మఠం స్థాపించడం జరిగింది. అక్కడున్న యువసన్యాసులకు రెండే లక్ష్యాలు ఉండేవి. ప్రజలకు సేవ చేయడం, ముక్తిని సాధించడం. కొద్ది మంది యువకులు తమ కుటుంబాల్ని వదిలిపెట్టి సన్యాసులుగా మారారు. నరేంద్రుడు కూడా సన్యాసిగా మారి ఆ మఠానికి నాయకుడయ్యాడు. ఆ యువ సన్యాసులు తిండి, బట్ట గురించి పెద్దగా ఆలోచించేవారు కాదు. ఉపవాసం ఉన్నపుడు కూడా తమ చదువును ధ్యానాన్ని నిర్లక్ష్యం చేసేవారు కాదు. నరేంద్రుడు వారికి సంస్కృతాన్ని బోధించేవాడు. అక్కడికి విచ్చేసే సందర్శకులకి గురువుగారి బోధనలను విడమరిచి చెప్పేవాడు. నరేంద్రుడు సన్యాసం స్వీకరించి వివేకానందుడిగా మారాడు. భారతదేశం అతని గృహమైంది. ఇక్కడి ప్రజలు అతని సోదర, సోదరీమణులయ్యారు. దురదృష్టవంతులైన తన సోదరుల కన్నీళ్ళు తుడవడం అతనికి ఎంతో ఆనందాన్ని కలిగించే పని. దేశమంతా పర్యటించాడు. తనకున్న ఆస్తి అంతా ఒక కాషాయ వస్త్రము, ఒక కమండలము, శిష్యగణం మాత్రమే. ఈ పర్యటనలో అతను ఎన్నో పుణ్యక్షేత్రాలను సందర్శించాడు. దారి మధ్యలో గుడిసెల్లోనూ, సత్రాలలోనూ నివసించేవాడు, కటిక నేలమీదనే నిద్రించేవాడు. అనేక మంది సాధువుల సాంగత్యంలో గడిపాడు. ఆధ్యాత్మిక చర్చలతో, పవిత్ర కార్యాల గురించిన చర్చలతో సమయం గడిపేవాడు. చాలా దూరం కాలినడకనే నడిచేవాడు. ఎవరైనా దయ తలిస్తే ఏదైనా వాహనంలో ఎక్కేవాడు. ఆళ్వార్ దగ్గర కొద్ది మంది ముస్లింలు కూడా ఆయనకు శిష్యులయారు. ఎవరైనా రైలు ప్రయాణానికి టిక్కెట్టు కొనిస్తేనే రైలులో ప్రయాణం చేసేవాడు. చాలాసార్లు తన దగ్గర డబ్బులేక పస్తుండాల్సి వచ్చేది. మైసూరులో స్వామికి దివాను శేషాద్రి అయ్యర్ , మైసూరు మహారాజా వారితో పరిచయం ఏర్పడింది. పండితుల సభలో స్వామిజీ సంస్కృతం లో చేసిన ప్రసంగం మహారాజా వారిని ముగ్ధుల్ని చేసింది. భారతదేశం వివిధ మతాల, వివిధ తత్వాల సమ్మేళనం. పాశ్చాత్యులు విజ్ఞానశాస్త్రంలో మంచి పురోగతి సాధించారు. ఈ రెండు కలిస్తే మానవజాతి మంచి పురోగతిని సాధించగలదు. కాబట్టి నేను అమెరికా వెళ్ళి అక్కడ వేదాంతాన్ని వ్యాప్తి చెయ్యాలను కుంటున్నాను అని స్వామిజీ మైసూరు మహారాజాతో అన్నాడు. అయితే ఆ ఖర్చులన్నీ నేనే భరిస్తానన్నాడు. మాహారాజా. స్వామిజీ ఆయనకు కృతజ్ఞతలు తెలిపి సమయం వచ్చినపుడు తప్పకుండా ఆయన సహాయం తీసుకుంటానని చెప్పి సెలవు తీసుకున్నాడు. తరవాత స్వామీ జీ భాస్కర సేతుపతి పరిపాలి( స్తున్న రామనాడును సందర్శించాడు. అక్కడి రాజు స్వామిజీని మిక్కిలి గౌరవించాడు. మీరు అమెరికాలో జరగబోవు సర్వమత సమ్మేళనానికి తప్పకుండా హాజరవాలి. అందుకయ్యే ఖర్చంతా నేను భరిస్తాను అన్నాడు. దానిని గురించి తప్పకుండా ఆలోచిస్తానని ఆయనకు మాట ఇచ్చి అక్కడి నుంచి రామేశ్వరానికి వెళ్ళి చివరకు కన్యాకుమారి చేరుకున్నాడు. కొద్ది దూరం ఈదుకుంటూ వెళ్ళి ఒక రాయి మీద కూర్చున్నాడు. పాశ్చాత్య దేశాలకు వెళ్ళి అక్కడ భారతదేశపు ఆధ్యాత్మిక విలువల్ని వారికి వివరించడం తన ప్రథమ కర్తవ్యంగా పెట్టుకున్నాడు. తరువాత స్వదేశానికి తిరిగి వచ్చి నిదురపోతున్న భారతజాతిని మేల్కొలపాలనుకున్నాడు. అతని ప్రయాణానికి ఖర్చుల నిమిత్తం దేశం నలుమూలల నుంచీ విరాళాలు




వచ్చి పడ్డాయి. కాని అతడు మాత్రం తన ప్రయాణానికి ఎంత కావాలో అంతే స్వీకరించాడు. మిగిలిన ధనాన్ని దాతలకు తిరిగి ఇచ్చివేశాడు. అతను ఎక్కిన నౌక బొంబాయి తీరం నుంచి 1893, మే 31వ తేదీన బయలు దేరింది. చికాగోలో ఆయన చేసిన ప్రసంగం తరవాతనే స్వామి గొప్పతనం ప్రపంచం గుర్తించింది.



తెలుగు, హిందీ భాషా చిత్రాల్లో నటించిన ఢిల్లీ భామ దేవయాని శర్మ కోలీవుడ్‌లో అడుగుపెట్టేందుకు తహతహలాడుతున్నారు. ముఖ్యంగా కోలీవుడ్ మోస్ట్ బ్యాచిలర్ శింబు సరసన నటించాలని తెగ ఆరాటపడుతున్నారు. తన జీవితాశయం కూడా శింబు సరసన నటించడమేనని అంటున్నారు. 2021లో 'రొమాంటిక్' అనే చిత్రం ద్వారా వెండితెరకు పరిచయమైన దేవియాని శర్మ... పలు రకాల నృత్యాల్లో శిక్షణ పూర్తి చేశారు. తన తమిళ సినీ రంగ ఎంట్రీపై ఆమె స్పందిస్తూ.. 'తెలుగు, హిందీ భాషా చిత్రాల్లో నటించినప్పటికీ.. తమిళంలో నటించాలన్న కోరిక బలంగా ఉంది. ముఖ్యంగా శింబు సరసన నటించాలన్నదే నా జీవితాశయం. కేవలం హీరోయిన్‌గానే కాకుండా, ప్రేక్షకులను మెప్పించే అన్ని రకాల పాత్రలు చేసే నటిగా గుర్తింపు పొందాలి. కీర్తి సురేష్, సాయిపల్లవి నాకు ఎంతో ఇష్టమైన హీరోయిన్లు. వీరే నాకు ఆదర్శం. శింబు సరసన నటించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నా. ఇందుకోసం ముమ్మరంగా నా వంతు కృషి చేస్తున్నా' అని దేవియాని శర్మ పేర్కొన్నారు. దేవియాని శర్మ ఇటీవల నటించిన వెబ్ సిరీస్‌లన్నీ మంచి ఆదరణను పొందిన విషయం తెలిసిందే. ముఖ్యంగా 'సేవ్ ద టైగర్స్', 'సైతాన్' వెబ్ సిరీస్‌లలో దేవియాని శర్మ నటనకు మంచి గుర్తింపు వచ్చింది. బోల్డ్ సీన్స్‌ని కూడా ఆమె ధైర్యంగా చేయడంతో.. ప్రస్తుతం ఆమెకు ఆఫర్స్ వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ఆమెకు కోలీవుడ్ నుండి పిలుపు వచ్చినట్లుగా తెలుస్తోంది. త్వరలోనే ఆమె కోలీవుడ్‌లోనూ బిజీ నటిగా మారతాననే ధీమాని వ్యక్తం చేస్తోంది.


## శింబు సరసన నటించాలన్నదే కోరిక

దేవయాని



# థియేటర్లలో గుటూరు కారం సందడి

మేకింగ్ వీడియోను వదిలిన చిత్రబృందం ప్రపంచవ్యాప్తంగా సందడి చేయబోతున్న సూపర్ స్టార్ మహేష్ బాబు 'గుంటూరు కారం' సినిమా నుండి మేకర్స్ మేకింగ్ వీడియోని వదిలారు. శుక్రవారం వడుదల కానున్న చిత్రం కోసం అభిమానులు సందడి చేస్తున్నారు. వీడియో చూస్తుంటే హిట్టు కళ కొట్టిచ్చినట్లు కనబడుతోంది. ఇందులో ఆర్టిస్టలందరినీ చూపించారు. దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ మేకింగ్ స్టైల్‌ని తెలిపేలా ఉన్న ఈ మేకింగ్ వీడియోలో.. సూపర్ స్టార్ మహేష్ బాబు స్వాగ్ చూసి.. సలామ్ చేయాల్సిందే అనేలా ఫ్యాన్స్‌కి ట్రీట్ ఇచ్చారు. ఫైట్స్, కామెడీ సీన్లు.. ఇలా అది, ఇది అని కాకుండా.. అన్నిరకాలుగా ప్రేక్షకులను అలరించే కంటెంట్ ఇందులో ఉన్నట్లుగా ఈ మేకింగ్ వీడియో చూస్తుంటే తెలుస్తోంది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. క్లాస్, మాస్, ఫ్యామిలీ లేదా యూత్ అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించగల, అన్ని వర్గాలలో ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న అరుదైన స్టార్లలో సూపర్ స్టార్ మహేష్ బాబు ఒకరు. అలాగే మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టంల్గ÷నర్లను అందిస్తూ, మాస్ ప్రేక్షకుల నుండి కూడా అదేస్థాయిలో ప్రశంసలు పొంది ఎంతో ఖ్యాతిని సంపాదించారు. వీరిద్దరూ కలిసి ఇప్పటి వరకు చేసిన 'అతడు, ఖలేజా' కల్ట్ క్లాసిక్‌లుగా నిలిచాయి. ఇప్పుడు 14 సంవత్సరాల విరామం తర్వాత మళ్లీ ఈ కాంబినేషన్‌లో సినిమా అనగానే అంచనాలు మామూలుగా లేవు. గుంటూరుకు చెందిన రమణగా మహేష్ బాబు తన కోసం రాసిన మాస్ పాత్రలో తనదైన శైలిలో ఒదిగిపోయారు. ఆయన పాత్ర
తీరుని తెలుపుతూ విడుదల చేసిన గ్లింప్స్.. అలాగే టీజర్, ట్రైలర్, పాటలు ఇప్పటికే విశేషంగా ఆకట్టుకుని సినిమాపై ఎక్కడాలేని అంచనాలను పెంచేశాయి. ఈసారి మహేష్ బాబు సరికొత్తగా కనిపిస్తున్నారు. ఆయన చెప్పే డైలాగ్స్, ఆయన యాటిట్యూడ్, ఆయన ఎనర్జీ అన్నీ కూడా ఇటీవలి కాలంలో ఆయన చేస్తున్న చిత్రాలకు భిన్నంగా సరికొత్తగా ఉన్నాయి. దాదాపుగా మహేష్ శైలి ఆయన తండ్రి సూపర్ స్టార్ కృష్ణ స్నేహపూర్వక శైలిని, మాస్ పాత్రలలో బాడీ లాంగ్వేజ్‌ని గుర్తు చేస్తుంది. శ్రీలీల హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో మీనాక్షి చౌదరి ఓ కీలక పాత్రలో కనిపించనుంది. రమ్యకృష్ణ, ప్రకాష్ రాజ్, జగపతిబాబు, జయరామ్ వంటి వారు ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించారు.




# విజువల్ వండర్‌గా హను-మాన్

క్రియేటివ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వస్తున్న ఫస్ట్ ఇండియన్ ఒరిజినల్ సూపర్ హీరో మూవీ 'హను-మాన్'. తేజ సజ్జా హీరోగా నటించిన ఈ మాగ్నమ్ ఓపస్ చిత్రం.. టీజర్, పాటలు, ట్రైలర్‌కి వచ్చిన ట్రెమండస్ రెస్పాన్స్‌తో గ్లోబల్ లెవల్‌లో క్రేజ్ సంపాదించుకుంది. హను-మాన్ సంక్రాంతి కానుకగా 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. సినిమా విడుదలకు ఒక రోజు ముందే ప్రీమియర్ షోలు ప్రకటించగా.. టికెట్లు అన్నీ హాట్ కేక్‌లా అమ్ముడైపోయాయి. దీంతో సినిమా కోసం ప్రేక్షకులు ఎంతగా వేచి చూస్తున్నారనేది అర్థమవుతోంది. తాజాగా ఈ సినిమాను చూసిన బాలీవుడ్ క్రిటిక్ తన రివ్యూని ట్విట్టర్ వేదికగా పంచుకున్నారు. సినిమాలో ఏమేం బాగున్నాయో వివరంగా చెబుతూ.. 'హను-మాన్'కు 3.5 రేటింగ్ కూడా ఇచ్చారు. ప్రశాంత్ వర్మ ఒక సాలిడ్ ఎంటర్‌టైనర్‌ని ప్రేక్షకులకి అందించాడు. హనుమాన్ సినిమా చాలా బాగుంది. ఇందులో డ్రామా, ఎమోషన్స్, విఎఫ్ఎక్స్, పురాణాలకు సంబంధించిన విషయాలతో ప్రశాంత్ వర్మ ఈ సినిమాని మలిచాడు

. గూజ్‌బంప్స్ తెప్పించే సీన్లు, అదిరిపోయే క్లైమాక్స్.. ఈ సినిమాకు ప్రధాన బలం. నేను ఈ సినిమాను ప్రేక్షకులకు రికమెండ్ చేస్తున్నాను. ఆర్టిస్టల విషయానికి వస్తే.. ఇందులో నటించిన నటీనటులందరూ అసాధారణమైన నటనను కనబరిచారు. తేజ సజ్జా తన పాత్రకు న్యాయం చేశాడు. వరలక్ష్మీ శరత్ కుమార్ తన మార్క్‌ని ప్రదర్శించింది. వినయ్ రాయ్ చాలా భయంకరంగా కనిపించాడు. సముద్రఖని తన సూపర్ ఫామ్‌ని కొనసాగించాడు. వెన్నెల కిశోర్ చాలా బాగా చేశాడు. డబ్బింగ్ కూడా పర్ఫెక్ట్‌గా కుదిరింది.

## షూటింగ్‌లో నితిన్‌కు గాయాలు



టాలీవుడ్ యంగ్ హీరో నితిన్‌కు ప్రమాదం జరిగినట్లు వార్తలు వచ్చాయి. నితిన్ ప్రస్తుతం వేణు శ్రీరామ్ డైరెక్షన్‌లో తమ్ముడు అనే సినిమా చేస్తుండగా.. దిల్ రాజు ఈ మూవీని నిర్మిస్తున్నాడు. ఇటీవలే ఈ మూవీ ప్రారంభంకాగా.. షూటింగ్ కోసం మారేడుమిల్లి అడవులకు వెళ్లారు. షూటింగ్‌లో భాగంగా భారీ యాక్షన్ సన్నీ వేశాలు జరుగుతున్న సమయంలో నితిన్‌కు గాయాలు అయినట్లు వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే ఈ వార్తలపై.. నితిన్ టీమ్ తాజాగా స్పందించింది. నితిన్ గాయప డిన ట్లు వస్తున్న వార్తలు అబద్ధమని వాటిలో నిజం లేదని తెలిపాయి. నితిన్ ప్రస్తు తం భుజం నొప్పితో బాధపడు తున్నాడని ఈ కారణంగానే కొన్ని రోజులు షూటింగ్‌కు బ్రేక్ ఇచ్చాడని తెలిపి ంది. భుజం నొప్పి కారణంగా ప్రస్తుతం ఇం ట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నాడని వెల్లడించింది. తమ్ముడు సినిమాలో నటిస్తున్న నితిన్ ప్రస్తుతం ఒక మంచి కమ్‌బ్యాక్ కోసం ఎదురుచూస్తున్నాడు. ఆయన చివరిగా నటించిన 'ఎక్స్‌ట్రా.. ఆర్డినరీ మ్యాన్', మాచర్ల నియోజక వర్గం సినిమాలు బాక్సాఫీస్ వద్ద భారీ డిజాస్టర్‌లు అందుకున్న విషయం తెలసిందే. దీంతో తన ఆశలన్నీ 'తమ్ముడి' పైనే పెట్టుకున్నాడు.

## సంక్రాంతి సినిమాపై నాగార్జున

'తెలుగువారికి సంక్రాంతి అంటే సినిమా పండుగ. ప్రేక్షకులు గతంలో నా సంక్రాంతి సినిమాలను గొప్ప హిట్ చేశారు. ఇప్పుడు 'నా సామిరంగ' చిత్రాన్ని కూడా అదే రీతిలో ఆదరిస్తారనే నమ్మకం ఉంది. ఈ సారి పండుగకు కిష్టయ్య వస్తున్నాడు. 'నా సామిరంగ' అంటూ బాక్సాఫీసును కొట్టబోతున్నాడు' అని నాగార్జున అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'నా సామిరంగ' చిత్రం ఈ నెల 14న విడుదలవుతోంది. విజయ్ బిన్నీ దర్శకుడు. ఇప్పటికే ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ 'ఈ సంక్రాంతికి నాలుగు సినిమాలు వస్తున్నాయి. అన్నింటినీ ఆదరించాలని ప్రేక్షకులను కోరుతున్నాను. నాన్నగారి ఆజ్ఞగా భావించి 'నా సామిరంగ' చిత్రం చేశాను. కీరవాణి అద్భుతమైన పాటలు ఇచ్చారు. మూడు నెలల్లో ఈ సినిమాను పూర్తి చేయడం ఒక రికార్డు' అని తెలిపారు. అల్లరి నరేశ్ మాట్లాడుతూ 'చిన్నతనం నుంచి నేను నాగార్జున గారికి అభిమానిని. ఈలలు వేస్తూ థియేటర్లలో ఆయన సినిమాలు చూశాను. కీరవాణి, చంద్రబోస్ గారు మా టీంకు అండగా నిలిచారు' అని తెలిపారు. రాజ్‌తరుణ్ మాట్లాడుతూ 'నాగార్జున గారితో కలిసి నటించడం మరచిపోలేని అనుభవం. అక్కినేని అభిమానులందరూ ఈసారి థియేటర్లలో పండుగ చేసుకోవడం ఖాయం' అన్నారు. విజయ్ బిన్నీ మాట్లాడుతూ 'చాలా తక్కువ టైంలో మంచి క్వాలిటీతో సినిమాను పూర్తి చేశాం. నా సాంగ్స్ చూసి దర్శకుడిగా అవకాశం ఇచ్చిన నాగార్జున గారికి రుణపడి ఉంటాను. యూనిట్‌లో ప్రతి ఒక్కరి సహకారంతో సినిమాను అనుకున్న విధంగా తెరకెక్కించగలిగాను' అన్నారు. కీరవాణి మాట్లాడుతూ 'కొత్త ప్రతిభను గుర్తించి అవకాశాలు ఇవ్వడంలో నాగార్జున ముందుంటారు. 'నా సామిరంగ'తో విజయ్ దర్శకుడిగా హిట్ అందుకోవాలి' అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి నాగార్జున గారు నన్ను ఆహ్వానించడమే గొప్ప గౌర వం అని చంద్రబోస్ తెలిపారు. నాగార్జున గారి లాంటి స్టార్‌తో నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను అని ఆశికా రంగనాథ్ చెప్పారు.

## నా సామిరంగా. .ఈసారి ఊపేస్తాం

